తగ్గని చలి తీవ్రత

వికారాబాద్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జనవరి 4 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పులి చంపేస్తోంది.. గురువారం వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 13.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కాగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 13.9డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మౌలాలిలో 15.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, గృహిణులు, పనులకు బయటకు వెళ్లే వారు చలికి వణుకుతూ వెళ్తున్నారు.

అనంతగిరికి పర్యాటక శోభ

ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధికి చర్యలు

- అనంతగిరి ఆలయం అభివృద్ధిపై దృష్టి
- పర్యాటక, అటవీశాఖ అధికారులు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష
- కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులకూ పర్యాటక శోభ



లోతైన లోయలు, వంపులు తిరిగిన రోడ్ల మలుపులు, పచ్చని చెట్ల సమూహాలతో అనంతగిరి కొండలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఈక్రమంలో తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలను ఎకో టూరిజంగా అభివృద్ధి పరిచే దిశగా అడుగులు పడుతున్నాయి. గురువారం కలెక్టరేట్‌లో పర్యాటక, అటవీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పై చర్చించారు.



అనంతగిరిలో పర్యాటకులు

వికారాబాద్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/వికారాబాద్ జనవరి4 : తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలను ఎకో టూరిజంగా అభివృద్ధి పరిచే దిశగా అడుగులు పడుతున్నాయి. అనంతగిరి కొండల్లో 213 ఎకరాలను ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతగిరి కొండలను ఎకో టూరిజం, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరిచే అంశంపై గురువారం కలెక్టరేట్‌లో పర్యాటక, అటవీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష నిర్వహించారు. పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచే అంశంపై చర్చించారు. అనంతగిరికి వారాంతాల్లో 5 వేల నుంచి 10 వేల మంది వరకు పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాత్రి వేళలో వెయ్యి మంది పర్యాటకులు అనంతగిరిలో బస చేసే విధంగా సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపద్మనాభస్వామి దేవాలయాన్ని అభివృద్ధి, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులనూ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి పరిచే అంశంపై చర్చించారు.

అడ్వెంచర్ టూరిజానికి అనుకూలం

అనంతగిరి కొండల్లో ప్రతిపాదించిన జంగిల్ రిసార్ట్స్ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అటవీ, పర్యాటక శాఖల మధ్య నెలకొన్న స్థల వివాదంతో ఆ పనులు 2011లో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బటర్‌ఫ్లై పార్క్ కూడా ప్రతిపాదనలకే పరిమితమైంది. అనంతగిరి అటవీ ప్రాంతంలో 1,654 హెక్టార్లలో అపారమైన ప్రకృతి సంపద, ఔషధ మొక్కలు ఉన్నాయి. వివిధ వన్యప్రాణులు, వందల రకాల పక్షులు, రకరకాల సీతాకోక చిలుకలున్నాయి. అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి పరిస్తే పర్యాటకులు పెరగనున్నారు. ఇప్పటి వరకు ఆధ్యాత్మిక కేంద్రంగా, సందర్శకులకు ఆహ్లాదం, ఆరోగ్యం పంచే ప్రాంతంగా పేరొందిన అనంతగిరి కొండలను వివిధ రకాల సాహస కృత్యాలకు నిలయంగా మార్చితే పర్యాటకుల సంఖ్య పెరగనుంది. స్థానికులకూ ఉపాధి అవకాశాలు మెరుగు పడనున్నాయి. పర్యాటకులను ఎక్కువ సంఖ్యలో ఆకర్షించే విధంగా ప్రైవేట్ భాగస్వామ్యంతో అనంతగిరిలో అడ్వెంచర్ టూరిజం అభివృద్ధి పరిచేలా గత ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు.

వారాంతాల్లో...

అనంతగిరి కొండల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హరిత వ్యాలీ వ్యూ రిసార్ట్స్ నిర్మాణం చేపట్టారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణం జరిగింది. సందర్శకుల కోసం కాటేజీలు, స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మించారు. వారాంతంలో ఈ రిసార్ట్స్ సందర్శకులతో కిటకిటలాడుతుంది. పర్యాటకులు ఆన్‌లైన్‌లో గదులు రిజర్వు చేసుకుని ఇక్కడకు వస్తుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో ఒక్క కాటేజీ కూడా ఖాళీ ఉండవు. ఇంకా ఎక్కువ సంఖ్యలో విడిది కేంద్రాలు ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఏటేటా పెరుగుతున్న సందర్శకులు

అనంతగిరి కొండల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. రోజూ పని ఒత్తిళ్లతో మునిగి తేలే ప్రజలు సేదతీరేందుకు అనంతగిరి కొండలు అనువైన ప్రాంతం. లోతైన లోయలు, వంపులు తిరిగిన రోడ్డు మలుపులు, పచ్చని చెట్ల సమూహాలతో అనంతగిరి కొండలు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడి వాతావరణం చూడగానే ఆకట్టుకునేలా ఉండడంతో పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ రెండు డిగ్రీల మేరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. హైదరాబాద్‌కు సమీపంలో అనంతగిరి కొండల వంటి ఆహ్లాదకరమైన ప్రాంతం మరొకటి లేకపోవంతో ఇక్కడికి వారాంతాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు.



ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తప్పని ఎదురుచూపులు..

తెలంగాణ ఊటీగా పేరుగాంచిన అనంతగిరి కొండలు పర్యాటకాభివృద్ధికి నోచుకోవడం లేదు. అనంతగిరి కొండలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచాలని చాలా కాలంగా జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అనంతగిరిని పర్యాటక కేంద్రంగా, ఎకో, వెల్‌నెస్, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి పరుస్తామని గత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. పర్యాటకులను మరింత ఆకర్షించే విధంగా తీర్చిదిద్దేందుకు అనంతగిరి కొండలను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చనే విషయమై ప్రణాళికలు కూడా రూపొందించారు. అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని పలుమార్లు సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో కేసీఆర్ హయాంలో అనంతగిరి కొండలు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా ప్రజలు ఆశించారు. అనంతగిరి కొండలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచే కేసీఆర్ ఆయన హయాంలో ఇక్కడ పర్యాటకాభివృద్ధికి సంబంధించిన పనులేవీ ప్రారంభించకపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు. జిందాల్ తరహాలో అనంతగిరి కొండలను టెంపుల్, వెల్‌నెస్, అడ్వంచర్ టూరిజం కేంద్రంగా, విశాఖ పట్నం మాదిరిగా వెల్‌నెస్ సెంటర్‌గా అభివృద్ధి పరుస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా ఆ దిశగా ఎలాంటి అడుగులు పడకపోవడం గమనార్హం.



పత్తి మిల్లు వద్ద రోడ్డెక్కి ధర్నా చేస్తున్న పత్తి రైతులు

రోడ్డెక్కిన పత్తి రైతులు

పూడూరు, జనవరి 4: పత్తికి మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధరణి కాటన్ మిల్ వద్ద రైతుల రాస్తారోకో నిర్వహించారు. పూడూరు మండలంలోని అంగడిచిట్టంపల్లి గేటు సమీపంలోని ధరణి కాటన్ మిల్లుకు గురువారంరైతులు పత్తి విక్రయానికి తెచ్చారు. సీసీఐ గిట్టుబాటు ధర రూ.7020లు ఉండగా రూ.100లు తగ్గించి రూ.6920కి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నాకు దిగారు. తమ పత్తిని సీసీఐ మద్దతు ధర రూ.7020 ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గిరి అక్కడికి చేరుకుని మార్కెట్ కార్యదర్శి ఎండీ షఫీయొద్దీన్, జిల్లా మార్కెట్ అధికారి సారంగపాణి, సీసీఐ అధికారి ఎంజీ బాలచంద్ రైతులతో మాట్లాడించారు. దేశం మొత్తం ఒకేరేటు వర్తిస్తుందని, మీ కోసం వేరే రేటు కేటాయించరని బదులిచ్చారు. దీంతో రైతులు చేసేది లేక ధర్నాను విరమించారు.

సివిల్ సప్లయీస్ గోదాం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

కీసర, జనవరి 4: మండల కేంద్రంలోని పౌర సరఫరాల శాఖ గోదాంను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ మేరకు ఆయన గోదాంలోని సామగ్రి నిల్వలను, రికార్డులను పరిశీలించారు. తరుగు లేకుండా వంద శాతం తూకంతో సమయానికి సరుకులను రేషన్ షాపులకు సరఫరా చేయాలని సంబంధింత అధికారులకు తెలియజేశారు. అదే విధంగా అక్కడికి వచ్చిన రేషన్ డీలర్ల సమస్యలను అడిగా తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నిర్ణత సమయానికి సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి.రాజేందర్, తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పనులను అడ్డుకున్న రైతులు

పరిహారం ఇచ్చాకే పనులు చేయాలి

తాండూరు రూరల్, జనవరి 4: తాండూరు మండలం జినుగుర్తి గ్రామ శివారులోని సర్వేనెంబర్-206లో ఇండస్ట్రియల్ పార్కు పనులను రైతులు అడ్డుకున్నారు. సర్వేనెంబర్-206లో 52 మంది రైతులకు సంబంధించిన 260 ఎకరాల భూమిని రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు కేటాయించింది. అయితే అట్టి భూమిలో తాండూరు పట్టణ శివారులోని నాపరాతి పాలిషింగ్ యూనిట్లనన్నింటినీ ఒకేచోట ఏర్పాటు చేసి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో కొంతమంది రైతులకు పరిహారం కూడా అందజేసింది. అయితే మరో 14మంది రైతులకు అట్టి భూమికి సంబంధించి ధరణిలో సరైన వివరాలు లేకపోవడంతో పరిహారం అందలేదు. దీంతో గురువారం తమకు పరిహారం రాలేదని రైతులు బాలప్ప, ఎల్లప్ప పనులను అడ్డుకున్నారు. ఈ సర్వేనెంబర్‌లో 7ఎకరాల 36గుంటల భూమి ఉందని, ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. పరిహారం ఇచ్చి పనులు చేసుకోవాలని ఎక్స్‌కవేటర్ వద్ద ఉన్న శ్రీనివాస్‌రెడ్డికి తేల్చి చెప్పారు. దీంతో కాంట్రాక్టర్ తహసీల్దార్ తారాసింగ్‌కు ఫిర్యాదు చేయగా ఈ విషయంపై విచారణ జరిపి బాధితులకు పరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని, పనులను మాత్రం అడ్డుకోవద్దని ఆయన రైతులకు సూచించారు.



మట్లాడుతున్న అధికారి కిషన్

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి

- ఇంటర్మీడియట్ మేడ్చల్, వికారాబాద్ జిల్లాల విద్యాధికారులు కిషన్, శంకర్‌నాయక్

మేడ్చల్ టౌన్/నవాబుపేట, జనవరి 4 : ప్రభుత్వ కళాశాలలో చదివే ఇంటర్ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉత్తీర్ణులయ్యే విధంగా అధ్యాపకులు విద్యార్థులకు బోధించాలని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి ఎం.కిషన్ అన్నారు. గురువారం ఆయన మేడ్చల్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అత్యధికులు నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటారని, వారి చదువు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని లెక్చరర్లకు సూచించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన విద్య అందించటానికి ప్రభుత్వం తనరఫున కావాల్సిన సహాయసహకారాలను అందిస్తామన్నారు. రెండు సంవత్సరాల పాటు కళాశాలలో ఇంటర్ చదివే విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు, మంచి విద్యాబుద్దులు నేర్పి పంపాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, స్టడీ హవర్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమాయతుల్లా తదితరులు పాల్గొన్నారు. అంతే కాకుండా వికారాబాద్ జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని ఇంటర్మీడియెట్ విద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. గురువారం నవాబుపేట మండల పరిధిలోని వట్టి మీనపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.

8న జాబ్, అప్రెంటిస్ మేళా

మేడ్చల్‌టౌన్, జనవరి 4 : మేడ్చల్ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ఈనెల 8న, పలు కంపెనీల ఆధ్వర్యంలో జాబ్, అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డి. శైలజ తెలిపారు. ఐటీఐలోని శిక్షణ పొందిన విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాల్గొనే విద్యార్థులు అర్హత గలవారు సర్టిఫికెట్లు రెండు జిరాక్స్ సెట్‌లతో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



తాండూరు ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని గురువారం డీఎస్పీ శేఖర్‌గౌడ్, సీఐ రాజేందర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ అనంతయ్య, ఫైర్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- తాండూరు, జనవరి 4

కబ్జాకు గురైన పార్కు స్థలాలను కాపాడాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్ టౌన్, జనవరి 4: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో అన్యాక్రాంతమవుతున్న పార్కు స్థలాలను కాపాడాలని బీజేపీ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వంశీవిజయ్ డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్‌లోని పలు వెంచర్లలో పార్కుల కోసం వదిలిన స్థలాలు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. పంచాయతీ లేఅవుట్, హెచ్ఎండీఏ లేఔట్‌లో పార్కులకోసం వదిలిన స్థలాలను కొందరు కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పలువురు బహుళ అంతస్తులు నిర్మిస్తున్నా మున్సిపల్ సిబ్బంది చోద్యం చూస్తున్నారన్నారు. అనుమతిలేని కట్టడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పార్కుస్థలాలను కాపాడటంతో పాటు, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన

మేడ్చల్‌టౌన్, జనవరి 4 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అడుక్కునే స్థితికి తెచ్చిందని ఆటో డ్రైవర్ల యూనియన్ మేడ్చల్ అధ్యక్షుడు ఎర్ర విజయరావు ఆరోపించారు. మహాలక్ష్మి పథకాన్ని నిరసిస్తూ గురువారం మేడ్చల్ పట్టణంలో ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో మేడ్చల్ ఆర్టీసీ డిపో వద్ద బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల వద్ద భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. ఈసందర్భంగా విజయరావు మాట్లాడుతూ... మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆటోలు నడుపుకుని జీవనోపాధి పొందుతున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలు దయనీయ స్థితికి చేరాయన్నారు. ఉచిత ప్రయాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, తమ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంత వరకు నిరసలు ఆగబోవన్నారు



బస్సుల్లో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

పరిగి, జనవరి 4: తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం పరిగి మండల ప్రతినిధులు ఎం.నాగేశ్వర్, నీరటి నరహరి, అకుతోట సత్యనారాయణ, పి.గోవింద్‌నాయక్‌లు అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం గురువారం పరిగిలోని ఏబీఎస్ ప్లాజాలో జరిగింది. అమరులైన ఉద్యమకారులు బందెయ్య, అంతారం నర్సింహ్మా, వేణుగోపాలచారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అమరులైన 1200 మందిలో ఇంకా చాలా మందికి ప్రభుత్వ సహాయం అందలేదన్నారు. కేసులు ఉన్నవారికే కాకుండా ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న వారి వివరాలను సేకరించి, వారికి 250 గజాల ఇంటిస్థలంతోపాటు, నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఉద్యమకారుల పిల్లలకు 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. ఉద్యమ లక్ష్మీ పేరుతో ప్రతి ఉద్యమకాకరుడికి నెలకు రూ.5 వేల పింఛన్ ఇప్పించాలని కోరారు. తెలంగాణ సాంస్కృతిక సారథిలో కూడా ఉద్యమకళాకారులకు అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు విద్యాసాగర్, ముజీబ్, యాదగిరి, మల్కయ్య, శంకర్, అనిత, యాదయ్య, డి.గోపాల్, పరశురాం, డి.శ్రీనివాస్, మొగులయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పరిగిలో సమావేశమైన ఉద్యమకారులు

ఫసియొద్దీన్ మృతి తీరని లోటు

వికారాబాద్: తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఫసియొద్దీన్ (సర్దార్) మృతి తీరని లోటు అని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఎస్.శుభప్రద్ పటేల్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మైనార్టీ నాయకుడు ఫసియొద్దీన్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రాజీవ్‌నగర్ కాలనీలోని ఫసియొద్దీన్ ఇంటివద్ద అతని మృతదేహానికి శుభప్రద్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ హఫీజ్, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, నాయకులు దత్తు, పాల్గొన్నారు.



ఫసియొద్దీన్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న శుభప్రద్ పటేల్

అధిష్ఠానం ఆదేశిస్తే లోక్‌సభ ఎన్నికల బరిలో ఉంటా

● మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తా

● మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



మేడ్చల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): త్వరలో జరగబోయే లోకసభ ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశిస్తే బీఆర్ఎస్ తరపున మల్కాజిగిరి పార్లమెంటు నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ మంత్రి హోదాలో పనిచేసిన తాను ఎమ్మెల్యే పదవిలో ఇమడలేకపోతున్నానని అన్నారు. ఎంపీగా పోటీచేసి పార్లమెంటుకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ భవన్‌లో పార్లమెంటు నియోజకవర్గ విస్తృత స్థాయిలో సమావేశాలు జరుగుతున్న తరుణంలో మల్లారెడ్డి వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం కూడా ఈనెల 21న నిర్వహించనున్నారు. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ మళ్లీ ప్రజల్లో పట్టుని పెంచుకునేందుకు ఎంపీ ఎన్నికలను కీలకంగా భావిస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో అవలంభించాల్సిన వ్యూహాలపై హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ భవన్‌లో రోజుకో పార్లమెంటు నియోజకవర్గంపై సమీక్షలు నిర్వహిస్తోంది. దేశంలోనే అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గమైన మల్కాజిగిరి నుంచి బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కంటోన్మెంట్ నియోజకవర్గాలుండగా అన్ని నియోజకవర్గాల్లోనూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2014లో మల్లారెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు నియోజవకర్గంలో టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొందారు. ఆ తర్వాత 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొంది మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో ఎంపీగా పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అధిష్ఠానం ఆదేశిస్తే తాను ఎంపీగా పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నానని ప్రకటించారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో నాట్యోత్సవం

●కళలు, సాంస్కృతిక కార్యక్రమాల పై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్ టౌన్, జనవరి 4 : విద్యార్థులకు చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించటానికి తమ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీ.వీ.రెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో టాప్స్ సొల్యూషన్ వారి ఆధ్వర్యంలో, స్టూడెంట్స్ కౌన్సిల్ సహకారంతో 'బ్రిందావన్ నాట్యోత్సవం 2024'ను నిర్వహించారు. ఈ సందర్భంగా టీ.వీ.రెడ్డి మాట్లాడుతూ.. దేశ సంస్కృతిలో కళలకు ప్రాధాన్యత ఎంతో ఉందని, సకల కళల సమ్మేళనంతో మన సంస్కృతి ఇమిడి ఉందని చెప్పారు. అన్ని కళలను గౌరవించి వాటిని ప్రోత్సహిచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పలు నాట్య సంస్థల కళాకారులు నాట్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో చెన్నైలోని కళాక్షేత్ర ఫౌండేషన్ కాలేజ్‌కు చెందిన ఆకాంక్ష, జవహర్ నవోదయ విశ్వ విద్యాలయానికి చెందిన శోభన సదా గోపాల్, వీరేంద్ర డాన్స్ ఆఫ్ స్కూల్ లర్నింగ్ డైరెక్టర్ శేశాద్రి సాధన, ఫౌండర్ డైరెక్టర్ కళా అంబాల, క్రిష్ణగిరికి చెందిన అపర్ణ సుందరం , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పీఆర్వో రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల భరత నాట్య ప్రదర్శన

క్రీడాకారులను ప్రోత్సహించాలి : సీఐ

కడ్తాల్, జనవరి 4: ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని కడ్తాల్ సీఐ శివప్రసాద్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక, వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. నిర్వాహకుడు రాఘవేందర్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌లతో కలిసి సీఐ శివప్రసాద్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడలు శారీరక ధారుఢ్యం, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మొగిళ్ల చెన్నయ్య, కాంటేకార్ వెంకటేశ్, కుమార్, మురళి, అంజి, వేణు, మధు, నరేశ్, సన్ని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం లక్ష్మణ్, సర్పంచ్ సంధ్యారాణి

షాబాద్, జనవరి 4: బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని షాబాద్ మండల నోడల్ అధికారి, సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, కుర్వగూడ సర్పంచ్ సంధ్యారాణి మల్లిఖార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం కుర్వగూడ గ్రామంలో పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆకృతి ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, కోఆప్టెడ్ మెంబర్ దాదె మహేష్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరక్షరాస్యత నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు. పిల్లలను బడిలో చేర్పిస్తేనే వారికి మంచి భవిష్యత్‌ను చూపిన వారమవుతామన్నారు. బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించి, భావి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలను పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు. విద్యార్థులు చదువుకుని అక్షరాస్యులు కావాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు యువకులు, గ్రామస్థులు నడుం బిగించాలన్నారు. దేశభవిష్యత్తు విద్యార్థుల చేతిలో ఉందని, అందుకోసం విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు నర్సింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిలీ లిపి కనుక్కోవడం గొప్ప విషయం

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 4: లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేకంగా లిపిని కనుక్కోవడం ఎంతో గొప్ప విషయమని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బ్రెయిలీ లిపితో ఎంతో మంది దివ్యాంగులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదిగారని తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 30కోట్ల మంది అంధులు బ్రెయిలీ లిపితో అక్షరజ్ఞానాన్ని పొందగలిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, జయరాం నాయక్, వెంకటేశ్వరమ్మ, కాంతారావు, సీనియర్ అసిస్టెంట్ జహీరుద్దీన్, రాములు, ఎఫ్ఆర్‌వో వెంకటేష్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులతో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్‌లో రోడ్ల మరమ్మతుకు రూ.300కోట్లు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి, జనవరి 4: వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు రూ.300కోట్ల నిధులు మంజూరైనట్లు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. మండలంలోని 98మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వదంతో తెలంగాణ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. అభివృద్ధికినిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వికారాబాద్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పాటు మరిన్ని నిధుల కోసం కేంద్రానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత, జడ్పీటీసీ మధుకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు కలీమోద్దీన్, రాములుయాదవ్, సుభాష్‌యాదవ్, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, సుభాష్‌యాదవ్, రామేశ్వర్, దివాకర్, తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్


ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆధార్ సెంటర్లను పెంచండి

ఎమ్మెల్యే వీర్లపల్లికి సీపీఎం నాయకుల వినతి

షాద్‌నగర్ అర్బన్, జనవరి 4: షాద్‌నగర్ పట్టణంలో ఆధార్ కేంద్రాల సంఖ్యను పెంచి ప్రజలు ఇబ్బందులను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గురువారం సీపీఎం నాయకుడు శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సమస్యను వివరించారు. షాద్‌నగర్ పట్టణంలో రెండు మాత్రమే ఆధార్ కేంద్రాలున్నాయని, కొత్త కార్డులతో పాటు మార్పుల కోసం పడికాపులు కాయాల్సి వస్తుందని వివరించారు. ప్రతీ రోజు 50కార్డులు మాత్రమే జారీ అవుతున్నందున రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని విన్నవించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా అధిక డబ్బులు తీసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆధార్ సెంటర్ల సంఖ్యను పెంచి, ప్రభుత్వ నిబంధనల మేరకు డబ్బులు తీసుకునే చర్యలు తీసుకోవాలని శ్రీనునాయక్ ఎమ్మెల్యేను కోరారు.

తంగడ్‌పల్లికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి


డిపో మేనేజర్‌కు వినతిప్రత్రాన్ని అందిస్తున్న తంగడ్‌పల్లి నాయకులు

చేవెళ్ల, జనవరి 4: తంగడ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిపించాలని కాంగ్రెస్‌పార్టీ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు పాండుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం తంగడ్‌పల్లి గ్రామస్తులు, పలువురు నాయకులు వికారాబాద్ డిపో మేనేజర్‌కు వినతిప్రతం ఇచ్చారు. ఈసందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. తమ గ్రామానికి అధికారులు బస్సును నిలిపివేశారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చేవెళ్ల నుంచి తంగడ్‌పల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ఆంజనేయులు, రాఘవరెడ్డి, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎండి. సలీం తదితరులు ఉన్నారు.



చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆరు గ్యారంటీలు.. పక్కాగా అమలు

చేవెళ్ల, జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. గురువారం రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు భీంభరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం 'ప్రజాపాలన కార్యక్రమం'ను తీసుకువచ్చిందని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకుని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి రాములు, సీహెచ్ రాజేశ్, అంజిరెడ్డి, హరిశ్వర్‌రెడ్డి, యాదయ్య, కృష్ణ, మాణయ్య, దయానంద్, జంగయ్య, రాయికంటి మాణిక్యం, రాములు తదితరులు ఉన్నారు.

అక్రమంగా నాపరాతి తవ్వకాలు చేపడితే చర్యలు

మైన్స్ ఏడీ శామెల్ జాకబ్


నాపరాతి కట్టింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ జాకబ్

తాండూరు రూరల్, జనవరి 4: నాపరాతి గనుల్లో ఎవరైనా లీజులు లేకుండా అక్రమంగా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు మైన్స్ ఏడీ శామెల్ జాకబ్ హెచ్చరించారు. మండలంలోని సంగెంకలాన్ గ్రామ శివారులో అక్రమంగా తవ్వుతున్న సర్వేనంబర్-109ని సందర్శించి పరిశీలించారు. సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు అట్టి గనిని సందర్శించగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తి 35మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరిపారని, దానిపై ఏ లెవల్ తవ్వకాలు చేపట్టారు. ఎంత మేరకు నాపరాతిని కట్ చేశారు. ఎన్ని మీటర్ల లోతు, ఎంత ముడి సరుకును తవ్వకాలు జరిపారనే దానిపై సమగ్ర వివరాలు సేకరించారు. ఈ నాపరాతి గనికి విద్యుత్ శాఖ నుంచి మీటరు తీసుకోవడానికి అనుమతి ఉందా? ఎంత బిల్లు చెల్లిస్తున్నారనే విషయంపై విద్యుత్ శాఖ ఏఈ నాయుడును అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మల్కాపూర్, సంగెంకలాన్, ఓగీపూర్, కోటబాస్పల్లి, సిరిగిరిపేట్ తదితర గ్రామాల్లోని ఎక్కడైనా అనుమతులు లేకుండా నాపరాతి తవ్వకాలు జరిపితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మండల పరిధిలోని మల్కాపూర్ సర్వేనెంబర్-74, 115, ఓగీపూర్ సర్వేనెంబర్-2, 129, కరన్‌కోట్ సర్వేనెంబర్-34 తదితర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా అక్రమ కనెక్షన్లపై విద్యుత్ శాఖ అధికారులకు అక్రమ కనెక్షన్లు తొలగించే విధంగా లేఖరాస్తానని తెలిపారు.

మెగా డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

నిరుద్యోగుల్లో ఆశలు నింపిన ముఖ్యమంత్రి ప్రకటన

- 4 నెలల కిందట 191 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఆర్టీ నోటిఫికేషన్..
- మూసివేసిన బడులను పున:ప్రారంభించి..
- ఉపాధ్యాయ పదోన్నతులు కల్పిస్తే 350 పోస్టుల వరకు అదనంగా ఖాళీలకు అవకాశం?
- ఉద్యోగ విరమణ ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటే ఇంకా పెరగనున్న ఖాళీలు
- ఉపాధ్యాయ నియామకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని నిరుద్యోగుల వినతి

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఇటీవల విద్యా శాఖపై సమీక్ష నిర్వహించి మెగా డీఎస్సీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో 5089 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నాలుగు నెలల కిందట నోటిఫికేషన్ జారీ చేయగా, దీంట్లో వికారాబాద్ జిల్లాలో 191 పోస్టుల భర్తీ చేయాలని నిర్ణయించారు.

నిరుద్యోగుల ఆందోళన

కాగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ పోస్టులు తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. నోటిఫికేషన్‌లో అరొకరగా చూపిన ఉపాధ్యాయ ఖాళీలను పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు పెద్ద ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తామంటూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించిన విషయం తెలిసిందే. తాము అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తామనే అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా వినియోగించుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి 2017లో టీఆర్టీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తరువాత ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేదు. డీఎస్సీ నిర్వహించాలంటూ నిరుద్యోగులు ఆరేళ్ల పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చినా అప్పటి ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. శిక్షణ పూర్తి చేసుకున్న వేలాది మంది నిరుద్యోగులు ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులకు ఎదురు చూపులు తప్పలేదు.

ఎదురుచూపులు ...

గత ప్రభుత్వం ప్రకటించిన ఖాళీలకు మరిన్ని పోస్టులు కలిపి భర్తీ చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మెగా డీఎస్సీ ప్రకటనపై నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 1039 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. 743 ప్రాథమిక, 114 ప్రాథమికోన్నత, 182 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలకు 4638 ఉపాధ్యాయ



పోస్టులు ప్రభుత్వం మంజూరు చేయగా, ప్రస్తుతం 3920 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. జిల్లాలో అన్ని కేటగిరిల్లో గత ఫిబ్రవరి నెల వరకు 718 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, గత ప్రభుత్వం 191 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, ఈ పోస్టుల్లో 102 స్కూల్ అసిస్టెంట్, 77 ఎస్‌జీటీ, 12 లాంగ్వేజ్ పండిత్ పోస్టులు ఉన్న విషయం తెలిసిందే. జిల్లాలో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 14 ఉండగా, విద్యార్థులు లేని పాఠశాలలు 34 ఉన్నాయి. 198 పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు మాత్రమే పనిచేస్తున్నారు. విద్యార్థులు ఉండి ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యా బోధన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

సీఎం నిర్ణయంతో..

ప్రతి గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలలు లేని గ్రామాలు ఉండకూడదన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కొత్తగా బీఎడ్, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికిసైతం టెట్ రాసే అవకాశం కల్పించే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయ ఖాళీలను పూర్తి స్థాయిలో భర్తీ చేసేందుకు అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

350 వరకు పెరగనున్న ఉపాధ్యాయ పోస్టులు ?

జిల్లాలో మూత పడిన పాఠశాలలను తెరిపించేలా చర్యలు తీసుకోవడం, పదోన్నతులు కల్పించడం, ఈ ఏడాది చివరి వరకు ఉద్యోగ విరమణ ద్వారా ఏర్పడే ఉద్యోగ ఖాళీలు 350 వరకు ఉండవచ్చనే ప్రచారం జరుగుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేక మూత పడిన పాఠశాలలను తెరిపించే విధంగా చర్యలు తీసుకుంటే 100 వరకు ఉపాధ్యాయ పోస్టులు అదనంగా ఏర్పడనున్నట్లు చెబుతున్నారు. మరోవైపు జీహెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగితే మరో 220 పోస్టుల వరకు ఎస్‌జీటీ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. టెట్ అర్హత కలిగిన ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించాలనే నిబంధనను ఇటీవల ఎన్‌సీఈఆర్టీ కొత్తగా అమల్లోకి తీసుకు రావడంతో గత ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ సజావుగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఇటీవల పాఠశాల విద్యా శాఖ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. టెట్ పరీక్ష నిర్వహించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తే జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు పెరగనున్నాయి. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందడానికి టెట్ అర్హత తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన అడ్డంకిగా మారింది. పదోన్నతుల ప్రక్రియ సాఫీగా సాగాలంటే డిపార్ట్‌మెంటల్ పరీక్ష మాదిరిగా ఇన్ సర్వీసు ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో రెండు లేదా మూడేళ్ల లోపు టెట్ అర్హత సాధించాలన్న షరతు విధించి పదోన్నతులు కల్పించవచ్చని చెబుతున్నారు.

టెట్ నిబంధనల్లో సడలింపు...

పదోన్నతులకు టెట్ అర్హత ఉండాలన్న నిబంధన విషయంలో కొంత సడలింపు వచ్చే విధంగా విద్యా శాఖ అధికారులు జాతీయ విద్యా శిక్షణా పరిశోధనా మండలి ఉన్నతాధికారులతో చర్చిస్తే సానుకూల ఫలితం వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అంతే కాకుండా ఈ ఏడాది మార్చి నెల 31వ తేదీ నుంచి ప్రతినెలా 61 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉద్యోగ విరమణ చేసే వారితో ఏర్పడే ఉపాధ్యాయ ఖాళీలను కూడా పరిగణనలోకి తీసుకుంటే మరిన్ని ఖాళీల భర్తీకి అవకాశం ఏర్పడనుంది. గత ప్రభుత్వం జిల్లాలో 191 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా, కొత్తగా మరో 350 ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, జనవరి 4 : మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కాంక్షించే మహాలక్ష్మి పథకాన్ని రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలోని గూడూరు కేశవ రెడ్డి గార్డెన్‌లో గురువారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు చెందిన 116 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, వైస్ఎంపీపీ ఆనంద్, జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్‌లు ముంతాజ్, లలిత, రంగారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ ముంతాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళల కళ్లల్లో ఆనందమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా కల్యాణమస్తు పథకంలో భాగంగా ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.లక్ష ఆర్థికసాయంతో పాటు ఇందిరమ్మ కానుకగా తులం బంగారం త్వరలో అందించడం జరుగుతుందని నారాయణరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ పాలనలో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తుందని, వివక్షతకు తావులేకుండా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎంపీటీసీ సభ్యులు పాలకుర్ల రాములు, బొప్పిడి గోపాల్, లచ్చిరామ్‌నాయక్, ఉమావతి బుగ్గయ్యగౌడ్, మంజుల చంద్రమౌళి, నిర్మలాదేవికాశీనాథ్ రెడ్డి, ప్రియ రమేశ్,పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, సర్పంచ్ లు శంకర్, భారతమ్మవిఠలయ్యగౌడ్, తులసీరామ్ నాయక్, సులోచన, సుగుణ, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, కృష్ణనాయక్, శ్రీను, మల్లేశ్‌గౌడ్, శేఖర్ గౌడ్, రాంచందర్ నాయక్, జహంగీర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ కె.నర్సింహులు

దివ్యాంగులు స్వయం ఉపాధి పొందాలి

డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు

వికారాబాద్, జనవరి 4: దివ్యాంగులందరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సిడ్బి అధ్వర్యంలో దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చిన్న, చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న నిరుపేద దివ్యాంగులను గుర్తించి వారికి వారి ప్రతిభకు తగ్గట్లు వ్యాపారంలో రాణించేలా చేయూతనివ్వాలన్నారు. అర్హులైన 43మంది దివ్యాంగులకు రూ.25వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు తెలిపారు. సిడ్బి ప్రతినిధి దక్షిణామూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, పీఎస్ శ్రీనివాస్, ఉదయ్, జిల్లా కోఆర్డినేటర్ రామేశ్వర్, కమ్యూనిటీ లీడర్లు సంజీవరావు, రాములు, శ్రీశైలం, యాదయ్య లబ్ధిదారులు బాలరాజు, వెంకటయ్య శ్రీశైలం, రాజు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు పూర్తి చేయరూ?

- ఆరు నెలలుగా కొనసాగుతున్న విస్తరణ పనులు
- కంకర, మట్టితో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు

మహేశ్వరం, జనవరి 4: తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలలుగా ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణకు 5కిలోమీటర్లకు రూ.14కోట్లు విడుదల చేసింది. రోడ్డు పనులను ప్రారంభంలో వేగవంతంగానే చేసినా సదరు కాంట్రాక్టర్ ఇప్పుడు ఆ పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తుమ్మలూరు, మహేశ్వరం ప్రజలే కాకుండా రెండు జాతీయ రహదారులైన శ్రీశైలం, బెంగళూరు హైవేలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే వాహనాల కంకరరాళ్లు తగులుతూ టైర్లు పంక్చర్ అవుతున్నాయి. వాహనాలు రిపేర్‌కు వస్తున్నాయి. దుమ్ముతో ద్విచక్ర వాహనదారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. బెంగళూరు హైవే ప్రాంత వాహనాలు, ప్రయాణికులు శ్రీశైలం జాతీయ రహదారిపైకి రావాలంటే తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు గుండానే రావాలి. ఇంత కీలక రోడ్డు విస్తరణ పనులు ఆరు నెలలుగా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. నూతన ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డు పనుల్లో వేగం పెరుగుతుందా? అని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.


నత్తనడకన సాగుతున్న తుమ్మలూర-మహేశ్వరం రోడ్డు

కంకరకే పరిమితమైన తుమ్మలూరు రోడ్డు



కాంట్రాక్టర్ పనులు వేగంగా చేయడం లేదు



ఆరు నెలలుగా రోడ్డు విస్తరణ పనులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం రోడ్డు విస్తరణకు రూ.14కోట్లు విడుదల చేసినా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వేగంగా పనులు చేయడంలేదు. దుమ్ము లేస్తున్న ఈ రోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. కంకరతో వాహనాలు రిపేర్‌కు వస్తున్నాయి. ఇప్పటికైనా ఈ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి ఇబ్బందులను తీర్చాలి. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

- మద్ది సురేఖ, సర్పంచ్, తుమ్మలూరు

రోడ్డు పనులను పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం

కల్వర్టుల నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలతో ఇప్పటి వరకు పనుల్లో జాప్యం జరిగింది. ఇప్పుడు కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. విద్యుత్ స్తంభాలను సైతం తొలగిస్తున్నాం. త్వరలోనే కల్వర్టుల నిర్మాణం పూర్తి చేస్తాం. రోడ్డు పనులన్నీ పూర్తిచేసి త్వరలోనే కొత్త రోడ్డును ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తాం.

- విజయ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

కొనసాగుతున్న 'అభయహస్తం' దరఖాస్తుల స్వీకరణ


వికారాబాద్: ప్రజాపాలన ధరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


పరిగి: సయ్యద్‌మల్కాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


తాండూరు: ప్రజా పాలనలో వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


కొడంగల్: దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్


ధారూరు: మున్నూర్‌సోమారంలో ప్రజాపాలన సభలో పాల్గొన్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, జనవరి 4: ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు 'అభయ హస్తం' దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. వికారాబాద్ మండలంలోని అత్వెల్లిలో నిర్వహించిన గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణను గురువారం కలెక్టర్ నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తులతో పాటు, ప్రజాపాలన బృందాలు నిర్వహిస్తున్న కౌంటర్లు, ఆయా పథకాల కింద వస్తున్న దరఖాస్తులను అయన పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను తప్పులు లేకుండా రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుభాషిని, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీఓ నాగరాజు ఉన్నారు.

ధారూరు: మండలంలోని మున్నూర్ సోమారంలో నిర్వహించిన గ్రామసభను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించారు. దరఖాస్తులను పరిశీలించి వారికి రశీదులు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనూష, ఎంపీటీసీ రవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: పట్లూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఎంపీడీవో రాజమల్లయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు స్వప్న సురేశ్, మహేశ్, మంజుల, నాయకులు సురేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మక్తతండా, లచ్చునాయక్‌తండా, కేసారం, ఎన్కెపల్లి గ్రామాల్లో అభయహస్తం ఆరు గ్యారంటీలకు గురువారం అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో శైలజారెడ్డి మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సరస్వతి, అనిత, చంద్రకళ, అనంతమ్మ, ఎంపీటీసీ కమ్లీబాయి, ఆర్ఐ రాజు, ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, ఏపీయం రాజు పాల్గొన్నారు. అదే విధంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలనలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు.

నవాబుపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, ఎంపీటీసీ యుద్దన్న అన్నారు. మండల పరిధిలోని గురువారం మీనపల్లి గ్రామంలో అధికారులు ప్రజాపాలన నిర్వహించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: సయ్యద్‌మల్కాపూర్‌లో ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులను ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి స్వీకరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ అరవింద్ రావు, జడ్పీటీసీ బి.హరిప్రియ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, భాస్కర్, లాల్‌కృష్ణప్రసాద్, కె.కృష్ణారెడ్డి, సర్పంచ్ సుల్తానా, పార్టీ మండల అధ్యక్షుడు బి.పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల కోసం అర్హులైన ప్రతీ ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని డీపీవో తరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోఓని తిరుమలపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన సదస్సులో గురువారం ఆయన పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఐదు గ్రామ సభల ద్వారా జిల్లా వ్యాప్తంగా లక్ష వరకు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కరీం, సర్పంచ్ వెంకటమ్మ, చిన్నయ్యయాదవ్, ఎంపీటీసీ రాంలాల్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు కుమ్మరి స్వామి పాల్గొన్నారు.

దోమ: మోత్కుర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పూడూరు: దేవనోని గూడంలో ప్రజాపాలనలో భాగంగా గురువారం గ్రామస్తుల నుంచి అధికారులు, ప్రజా ప్రతినిధులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యు.నారాయణ, భాస్కర్, శ్రీనివాస్, పరమయ్య, రమేష్, వెంకటయ్య, నారాయణ, పండరయ్య తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: 36గ్రామ పంచాయతీలకు గానూ గత నెలలో ప్రారంభమైన ప్రజాపాలన గ్రామ సభలు గురువారంతో ముగిశాయి. ఇప్పటివరకు గ్రామ సభల్లో 13వేల 17 దరఖాస్తులు అందాయి. కాగా ఈ నెల 6వరకు కూడా గ్రామ స్థాయి అధికారులకు నేరుగా అర్హులైన వారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్‌లో ఈనెల 17 నాటికి డేటా ఎంట్రీ చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీని డీటీపీ ఆపరేటర్ల ద్వారా పూర్తి చేయించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయనున్నారు.

తాండూరు: పాత మున్సిపాలిటీ వద్ద గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆరు గ్యారంటీ స్కీంల అమలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, మధుబాల, రత్నమాల, మాల విజయదేవి, ఆర్డీవో శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ఐనెల్లి, చెనిగేష్‌పూర్, గోనూరు, జినుగుర్తి గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా సర్పంచ్‌లు స్వప్నచంద్రశేఖర్‌రెడ్డి, జెట్టూరు రామమ్మ, పట్లోళ్ల రత్నమ్మ, కె.గోవింద్, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్‌లు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పట్లోళ్ల రత్నమ్మ, స్వప్నచంద్రశేఖర్‌రెడ్డి, జెట్టూరు రామమ్మ, ఎస్.రవీందర్‌గౌడ్, సాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంతో పాటు ఇందూర్, తట్టెపల్లి, ఆడ్కిచర్ల గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన సదస్సుల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, సర్పంచ్ విజయమ్మ, వైస్‌ఎంపీపీ మధులత, ఎంపీటీసీ అంబరయ్య, కోఆప్షన్ సభ్యులు నసీర్, శ్రీనివాస్‌రెడ్డి, శోభారాణి, ఎల్లారెడ్డి, జితేందర్‌రెడ్డి, రియాజ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

యాలాల: ప్రజాపాలనలో ప్రతీఒక్కరి దరఖాస్తులను తీసుకుంటామని యాలాల మండల వ్యవసాయ అధికారి యాదగిరి అన్నారు. మండలంలోఓని రాస్నం, గంగాసాగర్, సంగాయిపల్లి తండా, పగిడ్యాల్, అచ్యుతాపూర్, తిమ్మాయిపల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా గ్రామాల్లో అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సురేఖ, బసిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రాస్నం ఉపసర్పంచ్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన సదస్సుల్లో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ పాల్గొన్నారు. అదే విధంగా కొడంగల్ మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన సదస్సులో డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్, తహసీల్దార్ బి.విజయ్‌కుమార్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన సదస్సులను వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్ పరిశీలించారు. బొంరాస్‌పేట్, దుద్యాల, చౌదర్‌పల్లి, రేగడిమైలారం గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశం, దానయ్య, ఎంపీడీవో వెంకన్న గౌడ్, ఆర్ఐలు రవినాయక్ పాల్గొన్నారు. దుద్యాల మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్లు దానయ్య, వెంకటేశ్ ప్రజాపాలన నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీలకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మేడ్చల్‌జిల్లాలో..

మేడ్చల్ టౌన్: అభయ హస్తం ఐదు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీఒక్కరు లబ్ధి పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ మండల గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ అన్నారు. ఆయన గురువారం గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటి వరకు గ్రామంలో 800 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీలో పలు వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పాల్గొని స్థానిక ప్రజల నుంచి అభయ హస్తం గ్యారంటీల దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కో-ఆప్షన్‌సభ్యులు, మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని ఉద్దెమర్రి, మూడుచింతలపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయితీ వద్ద ఏర్పాటు చేసిన అభయ హస్తం దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వత్సలాదేవి, తహసీల్దార్ వాణిరెడ్డి, ఎంపీవో సునిత పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని వివిధ గ్రామాల్లో సంబంధిత అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆరోరోజు గురువారం కొనసాగించారు. మండలంలోని శామీర్‌పేట, అలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట, తుర్కపల్లి యాడారం, మురహరిపల్లి, మజీద్‌పూర్, బాబాగూడ, బొమ్మరాశిపేట పొన్నాల్ గ్రామాల్లో సంబంధిత అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్‌లోని 16 వార్డుల్లో ఏర్పాటు చేసిన 20కేంద్రాల్లో ఇప్పటి వరకు మొత్తం 5469, రేషన్ కార్డులకు 1590 దరఖాస్తులు స్వీకరించినట్లు కమిషనర్ జైత్రామ్ నాయక్ తెలిపారు.


మేడ్చల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్


మూడుచింతలపల్లిలో దరఖాస్తుల స్వీకరణ


బొంరాస్‌పేట్: ప్రజాపాలనలో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్


తాండూరు రూరల్: ఐనెల్లి గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సర్పంచ్ స్వప్న చంద్రశేఖర్‌రెడ్డి


మర్పల్లి: పట్లూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో రాజమల్లయ్య


కులకచర్ల: తిరుమలపూర్‌లో ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీపీవో తరుణ్‌కుమార్

'తొలిమెట్టు' విద్యాబోధన భేష్

● జడ్పీచైర్‌పర్సన్ అభినందన

ధారూరు, జనవరి 4: పాఠశాలలో అమలు చేస్తున్న తొలి మెట్టు విద్యా బోధన బేషుగ్గా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాచారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యారాలు శివాణి, విద్యార్థులలో గురువారం ఆమె వీడియోకాల్‌లో మాట్లాడారు. సులభంగా పాఠాలు అర్థమయ్యేలా ప్రత్యేక పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. వీడియో కాల్‌లో ఆమె విద్యార్థులతో మాట్లాడగా టీఎల్ఎం పద్ధతిలో విద్యాబోధన బాగుందన్నారు. పాఠాలు బాగా అర్థమవుతున్నాయని విద్యార్థులు తెలిపారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థులు ఇంగ్లీషు భాషలో మాట్లాడటం చూసి ఆమె ఆశ్చర్యపోయారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నాణ్యమైన విద్య పొందుతున్నారనడానికి కాచారం పాఠశాలనే నిదర్శనమని ఆమె అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి సన్మానం


తిరుపతిరెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

బొంరాస్‌పేట్, జనవరి 4: అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటి సారిగా బొంరాస్‌పేట్ మండలంలో పర్యటించిన కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని పార్టీ నాయకులు సన్మానించారు. గురువారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, కృష్ణ, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, నర్సిములునాయుడు, రాజేశ్‌రెడ్డి, వెంకటరమణ శాలువాలతో సన్మానించారు.

'ఏసీఈ' అధ్యాపకుడికి డాక్టరేట్


రవికుమార్

ఘట్‌కేసర్ రూరల్ జనవరి 4 : ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వన్నేజ్ రవికుమార్ జేఎస్టీయూ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ పూర్ణచందర్ రావు పర్యవేక్షణలో సిక్వెన్షియల్ ప్యాటర్న్ మైనింగ్ ఓవర్ లార్జ్ డాటాసెట్స్ విత్ ఆప్టిమల్ ఫ్రేమ్‌వర్క్ అనే అంశంపై పరిశోధన చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా దేవుని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రవికుమార్ గత 18 సంవత్సరాలుగా బోధనారంగంలో సేవలు అందిస్తున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

కులకచర్ల, జనవరి 4: అంతారం గ్రామంలో గురువారం బోయిని లక్ష్మమ్మ(60) మృతిచెందింది. ఆమె అంత్యక్రియలకు వారి కుటుంబానికి ముదిరాజ్ సంఘం గ్రామశాఖ ఆధ్వర్యంలో గురువారం రూ.6400 ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శివరాములు, బుచ్చయ్య పాల్గొన్నారు.

రాముడి అక్షింతలతో శోభాయాత్ర


కీసరలో ఆయోధ్య శ్రీరాముని అక్షింతల కలశాల శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

కీసర, జనవరి 4: అయోధ్య శ్రీరాముడి పూజిత అక్షింతల కలశాల శోభాయాత్ర గురువారం కీసరలో వైభవంగా జరిగింది. గ్రామానికి చేరుకున్న అక్షింతల కలశాలకు గ్రామ దేవత బంగారు మైసమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్దలు, ప్రముఖులు, భక్తులు మంగళహారులతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం కలశాల అక్షింతలను శోభాయాత్రగా గ్రామంలో రథంపై ఊరేగించి సీతారామచంద్ర స్వామి ఆలయానికి చేర్చారు. శోభాయాత్రలో భాగంగా గ్రామస్థులు, రామభక్తులు కాషాయం జెండాలతో జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఆలయానికి చేరుకున్న అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేస్తామని గ్రామపెద్దలు తెలిపారు.

మోమిన్‌పేట్: మండలంలోని టేకులపల్లి గ్రామంలో ఇంటింటికి శ్రీరాముల అక్షింతలను వితరణ చేసినట్లు హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు నీలి నగేశ్ తెలిపారు. గ్రామంలోని హనుమాన్ మందిరంలో ఉంచిన అయోధ్య రాముని అక్షింతలను గురువారం ఇంటింటికి తిరిగి ప్రజలకు అందజేశారు. అక్షింతలతో పాటు జనవరి 22న జరిగే అయోధ్య శ్రీరాముని విగ్రహం ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతీ ఇంటికి అక్షింతలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆ రోజు ప్రతీ ఇంట్లో ఐదు దీపాల చొప్పున వెలిగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హిందూ సంఘాల సభ్యులు పూజారి దిలీప్‌కుమార్, నారాయణ రెడ్డి, శివారెడ్డి, మాధవరెడ్డి, బ్రహ్మంచారి, బిక్షపతి, జీవన్‌కుమార్, మల్లేశం, సాయిరెడ్డి, లడ్డు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో అయోధ్య రామ మందిర ప్రతిష్ఠాపన అక్షింతల శోభాయాత్ర గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, పార్టీ జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ సౌమ్యరెడ్డి, స్థానికులు అంజిలయ్య, చంద్రలింగం, కృష్ణయ్య గౌడ్ పాల్గొన్నారు.


మోమిన్‌పేట్: టేకులపల్లిలో అక్షింతలు అందజేస్తున్న హిందూ సంఘాల సభ్యులు


కులకచర్లలో శోభాయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

యువత బాధ్యతలను మరవొద్దు

● ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


పెంటయ్యను సన్మానించి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, జనవరి 4: యువత తమ బాధ్యతలను మరువరాదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. యువతలో మార్పు కోసం మేముసైతం మీ కోసం అంటూ గత నెల రోజులుగా పూడూరు మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 12వేల మంది యువకులను మోటివేషన్ టీచర్ సేవక్ కుమార్‌తో కలిసి చైతన్య పరిచారు. గురువారం ముగింపు కార్యక్రమం మన్నెగూడ జేకే ఫంక్షన్ హాల్‌లో జాతీయ బెస్ట్ సొసైటీ అవార్డు గ్రహీత పెంటయ్య(కార్యక్రమం దాత) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, స్థానిక ఎంఈవో హరిశ్చందర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కాలంలో యువత కన్న తల్లిదండ్రులను విస్మరించడమే కాకుండా చెడు వ్యసనాలకు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఎవరూ తమ బాధ్యతలను మరవకుండా యువత తమ లక్ష్యం కోసం పాటుపడాలని సూచించారు. యువకులను చైతన్య పరిచే కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే పెంటయ్యను సన్మానించారు. కార్యక్రమంలో దాదాపుగా 2వేల మంది విద్యార్థులు వివిధ పాఠశాల నుంచి పాల్గొంచుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన


కులకచర్ల: బండ వెల్కిచర్లలో చెంచు ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

కులకచర్ల, జనవరి 4: మండలంలోని బండ వెల్కిచర్ల, బొంరెడ్డిపల్లి, సాల్విడ్, రాంపూర్, రాంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో చెంచు కుటుంబాలకు ప్రధాని నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అధికారులు గురువారం అవగాహన కల్పించారు. పీఎం జన్‌ధన్‌యోజన, ప్రమాదబీమా, ముద్ర రుణాలు తదితర పథకాలపై వివరించారు. ఆధార్‌కార్డు లేనివారు వెంటనే తీయాలని సూచించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్రంలో బీజేపీ పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నియమించిన ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి


బ్రిడ్జి పక్కన పొదల్లో దస్తగిరి మృతదేహం, ప్రమాదానికి గురైన బైక్

తాండూరు రూరల్, జనవరి 4: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్లాపూర్ గ్రామానికి చెందిన కొత్తకుర్వ దస్తగిరి(18) కొన్నేళ్ల కిందట తండ్రి మృతిచెందగా, మేకల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి కర్ణాటక రాష్ట్రం మిర్యాణ్‌లో తమ్ముడు శ్రీకాంత్‌ను కలిసి బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కొత్లాపూర్ సరిహద్దు చెక్ పోస్టు సమీపంలోని బ్రిడ్జిపై నుంచి వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం దస్తగిరి బైక్‌ను ఢీ కొట్టడంతో ఎగిరి బ్రిడ్జి పక్కన ఉన్న పొదల్లో ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో దస్తగిరి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వాహనదారులు కొత్లాపూర్ గ్రామానికి వచ్చి సమాచారం అందించారు. దీంతో సర్పంచ్ బుడ్డెళ్లి సాయిలు అక్కడికి చేరుకుని తమ గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ మధుసూదనరెడ్డి ప్రమాదస్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే దస్తగిరి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ బుడ్డెళ్లి సాయిలు, రేణుకా ఎల్లమ్మ ఆలయం చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు ప్రదీప్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ఎమ్మెల్యేని కలిసిన శాస్త్రవేత్తలు

తాండూరు, జనవరి 4: తాండూరులో ప్రజాభవన్‌లో గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు, హెడ్ డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుధాకర్, టి రాజేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంది పరిశోధన కేంద్రం ఏర్పాటుకు తాండూరు అనుకూలతపై ఒక నివేదికను ఎమ్మెల్యేకి అందజేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు శాస్త్రవేత్తలు ఎమ్మెల్యేకు వివరించారు.


తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో శాస్త్రవేత్తలు